
ద్వారకాతిరుమల ఆలయం వద్ద వర్షం జోరు

జిల్లాలో వర్షం జోరు

ఏలూరు సిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కొనసాగుతోంది. జిల్లాలో ఆదివారం మోస్తరు వర్షం, అక్కడక్కడా భారీ వర్షం కురిసింది. గడచిన 24 గంటల్లో అత్యధికంగా కుక్కునూరు మండలంలో 32.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వేలేరుపాడులో 12, దెందులూరులో 5.2, పోలవరంలో 3.6, ఆగిరిపల్లిలో 2.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పోలవరంలో..

పోలవరం: అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా పోలవరంలో నిరంతరాయంగా వర్షం కురుస్తూనే ఉంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరపి లేని వర్షంతో వీధులు జలమయం అయ్యాయి. గూటాల, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, పోలవరం గ్రామాలలో ఏటిగట్టుకు దిగువన నివాసాలు జలమయం అయ్యాయి. పట్టిసీమ వీరభద్రపురం సంచార జాతుల కాలనీలలో నీరుచేరి స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

ఏలూరు సిటీ: పెరుగుతున్న గోదావరి వరద ఉధృతి కారణంగా అధికార యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. ప్రజలు నదిలో ఈతకు వెళ్లడం, చేపల పట్టడం చేయరాదని హెచ్చరించారు. అత్యవసర సమయంలో మోటార్ బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. గోదావరి వరద నేపథ్యంలో కలెక్టరేట్‌లో 1800-233-1077, 94910 41419 ఫోన్ నెంబర్లతో ప్రత్యేక కంట్రోలు రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎంపీ

వర్షాలు, గోదావరి, కొల్లేరు వరద ఉధృతి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ సూచించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్, వైద్యశాఖ, విద్యుత్ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ అత్యవసర సహాయక చర్యలు వేగవంతం చేయాలన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితులను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

ఏలూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ఈ నెల 18న సోమవారం ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) రద్దు చేశారు. ప్రజలు గమనించాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.


మునిగిన పెనుమాకలంక రహదారి


కుక్కునూరు-దాచారం మధ్య గోదావరి వరదకు నీట మునిగిన గుండేటివాగు కాజ్‌వే

కొల్లేరు ఉధృతి గోదావరి ఉరకలు వరద భయం

జిల్లా ప్రజలు వరద భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ఎగువన వర్షాలతో డ్రెయిన్ల వాగుల నీరు భారీగా పోటెత్తడంతో కొల్లేరు వరద ఉధృతి పెరిగింది. రహదారులు నీట మునిగి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసరమైతే గ్రామస్తులు పడవలపై వెళుతున్నారు. మరోవైపు గోదావరి వరద కూడా పెరుగుతోంది. కుక్కునూరు మండలంలో గుండేటి వాగు కాజ్‌వే నీట మునిగింది. అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గోదావరిలో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

- కొల్లేరుకు పోటెత్తిన వరద నీరు
- నీట మునిగిన రహదారులు
- గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- పొంగుతున్న డ్రెయిన్లు.. స్తంభించిన ప్రవాహం
- పెరుగుతున్న గోదావరి వరద
- గుండేటి కాజ్‌వే నీట మునక

కైకలూరు/మండవల్లి/ముదినేపల్లి/ఏలూరు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కొల్లేరుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువ నుంచి నుంచి భారీగా వరద నీరు కొల్లేరులో చేరుతోంది. పెద్దఎడ్లగాడి వంతెన వద్ద గుర్రపుడెక్క పట్టి వేయడంతో ఎగువ ప్రవాహం వంతెన దిగువకు వెళ్లడం లేదు. దీంతో ఎగువన గ్రామాలైన పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, చింతపాడు, పులపర్రు, తక్కెళ్లపాడు గ్రామాల సరిహద్దు వరకు వరద నీరు వచ్చి చేరింది. పెద్ద ఎడ్లగాడి-పెనుమాకలంక రహదారిపై మూడు అడుగుల నీరు చేరడంతో రాకపోకలను నిలిపి వేశారు. ప్రజల అవసరాలకు ట్రాకర్లు, మరబోట్లలో పెద్దఎడ్లగాడికి చేరుకుంటున్నారు. అధికారులు అప్రమత్తమై వరద ఉధృతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సూచించారు. రోడ్లు పూర్తిగా నీట మునిగితే రాకపోకలను నిలిపివేయాలని, ప్రజలు వరదల్లో చిక్కుకోకుండా

మిగతా 8వ పేజీలో..

భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 34 అడుగులు

కుక్కునూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి 34 అడుగులకు చేరుకుంది. కుక్కునూరు, దాచారం గ్రామాల మధ్య లోలెవెల్ గుండేటి వాగు కాజ్‌వే నీట మునిగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు నల్లకుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. పెరుగుతున్న గోదావరి వరదతో రైతాంగంలో ఆందోళన నెలకొంది. గోదావరి తీరంలో పత్తి, అరటి పంటలు నష్టపోయే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ రమేశ్‌బాబు అధికారులు, స్థానిక రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అప్రమత్తంగా ఉండాలని రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు.

జంగారెడ్డిగూడెం: గోదావరి వరద ప్రవాహం పెరుగుతోందని, పరీవాహక ప్రాంత మత్స్యకారులు, ప్రజలు గోదావరి నదిలో వేటకు వెళ్లరాదని ఆర్డీవో ఎంవి.రమణ సూచించారు.


ముదినేపల్లి వద్ద పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్


కోమటిలంక రహదారిపై వరద నీరు


పెద్దఎడ్లగాడి నుంచి పడవలో పెనుమాకలంక గ్రామానికి చేరుకుంటున్న ప్రజలు


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నా నియోజకవర్గానికి నీళ్లివ్వండి

తెలంగాణ అధికారులతో మంత్రి పార్థసారథి

చాట్రాయి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి నాగార్జున సాగర్ కాలువకు నీరు విడుదల చేయించింది నేను, కానీ నా నూజివీడు నియోజకవర్గానికి ఇవ్వకుండా వేరే నియోజకవర్గాలకు నీళ్ల ఇవ్వడం ఏమిటి?' అని గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి నాగర్జున సాగర్ ప్రాజెక్ట్ (ఎన్ఎస్పీ) అధికారులను ప్రశ్నించారు. చాట్రాయి మండల టీడీపీ నాయకులు, రైతులు శనివారం రాత్రి నూజివీడులో మంత్రి సారథిని కలిసి మండలంలో ఖరీఫ్ సాగుకు నీటి కొరత ఏర్పడనుందని తెలిపారు. వెంటనే స్పందించిన మంత్రి ఎన్ఎస్పీ ఎస్ఈ, ఈఈలకు ఫోన్ చేసి మాట్లాడారు. తెలంగాణలో కాలువకు గండి పడడంతో తక్కువ నీరు నడుపుతున్నామని వారు తెలిపారు. తన సొంత నిధులు రూ.1.5 లక్షలు పంపుతానని, వెంటనే గండి పటిష్టం చేసి నూజివీడు నియోజకవర్గంతో పాటు మొత్తం ఆయకట్టుకు సాగునీరందించాలని మంత్రి ఆదేశించారు. ఆదివారం ఉదయం ఎన్ఎస్పీ వేంపాడు మేజర్‌కు అధికారులు సాగర్ జలాలు విడుదల చేశారు.

తమ్మిలేరు ప్రాజెక్టుకు జలకళ

చాట్రాయి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎగువన కురిసిన భారీ వర్షాలకు తమ్మిలేరు ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 579 క్యూసెక్కులు ఉండగా, నీటిమట్టం 339 అడుగులకు చేరినట్లు ఏఈ లాజర్‌బాబు తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద ఏలూరు జిల్లాలో 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. తెలంగాణలోని బేతుపల్లి జలాశయం, తుంబూరు ఆనకట్ట నిండితే తమ్మిలేరు ప్రాజెక్టుకు వరద పోటెత్తే అవకాశం ఉందని అధికారుల అంచనా.


తమ్మిలేరు ప్రాజెక్టులో చేరిన వరద నీరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విలీన మండలాలకు స్త్రీ శక్తి

భద్రాచలం - రాజమండ్రి, భద్రాచలం- రేపాకగొమ్ము సర్వీసులు ఎటపాకకు పొడిగింపు

ఏలూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విలీన మండలాలు, గ్రామాల ప్రయాణికులకు స్త్రీ శక్తి పథకం వర్తింపజేస్తున్నట్టు ఏలూరు డీపీటీవో షేక్ షబ్నం తెలిపారు. 'వీరికి ఉచితం లేదట' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి షబ్నం స్పందించారు. జంగారెడ్డిగూడెం డిపో పరిధిలోని పోలవరం ముంపు మండలాల ప్రయాణికులకు స్త్రీ శక్తి పథకం వర్తింపజేస్తున్నామని అన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, అశ్వారావుపేట ప్రాంతాలకు వెళుతున్న బస్సులను భద్రాచలం-రాజమండ్రి, భద్రాచలం- రేపాకగొమ్ము సర్వీసులను ఎటపాక వరకు పొడిగించామన్నారు. భద్రాచలం వెళ్లే ఈ రెండు సర్వీసులను ఆంధ్రప్రదేశ్‌లోని ఎటపాక వరకు పొడిగిస్తూ ఎన్‌క్లేవ్ (ఏపీలో ప్రారంభమయ్యి మధ్యలో తెలంగాణ వచ్చి మళ్లీ ఆంధ్రా రూట్ రావడం) రూట్‌గా మార్చడం ద్వారా సదరు సర్వీసు మార్గంలోని కుక్కునూరు, వేలేరుపాడు (విలీన మండలాలు) గ్రామాల ప్రజలకు స్త్రీ శక్తి పథకం పరిధిలోకి తీసుకొచ్చినట్టు షబ్నం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాష్ట్ర సర్వీసైన అశ్వారావుపేట షటిల్ సర్వీసును జీరో టికెట్‌గా మార్పు చేశామన్నారు. ఇది జంగారెడ్డిగూడెం - జీలుగుమిల్లి సర్వీస్‌గా కొనసాగుతుందన్నారు. ఈ మార్గంలోని ఏపీ గ్రామ ప్రయాణికులకు స్త్రీ శక్తి పరిధిలోకి వస్తారన్నారు.


ముదినేపల్లి-గుడివాడ బస్సులో మహిళలు

ఉచిత ప్రయాణాల మోత

బస్సులలో మహిళల రద్దీ

ఏలూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వరుస సెలవులు పూర్తి కావడం.. ఉచిత బస్సు ప్రయాణాలు అందుబాటులోకి రావడంతో ఆదివారం మహిళలతో బస్సులు కిటకిటలాడాయి. పెళ్లిళ్ల, శుభకార్యాలు కూడా పనిలో పనిగా కానిచ్చేశారు. కుటుంబ సమేతంగా బాలికల ఆధార్ కార్డులు కవరులో పెట్టుకుని ప్రయాణాలు చేసేశారు. కొందరు కండక్టర్లు ఆధార్‌కార్డు ఒరిజినల్ తెచ్చుకోకపోతే ఎలా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. మహిళలు ఎడాపెడా ఆదివారం రాకపోకలతో బస్టాండలన్నీ సందడిగా మార్చేశారు. పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణికులకు తాకిడి పెరిగింది. తొలి రోజు 2,781 ఉచిత ప్రయాణాలు చేయగా, రెండోరోజు శనివారం 11,124 మంది రాకకపోకలు సాగించారు. ఆదివారం ఈ సంఖ్య రెట్టింపైంది. రాత్రి 7గంటల సమయానికి అధికారులరు అందిన సమాచారం ప్రకారం 26,729 మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారు. జీరో టిక్కెట్ రూపంలో ఆర్టీసీ భారం రూ.11.31 లక్షలు తేల్చారు.

తీరు మారింది!



ఒకప్పటి జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటి సమావేశం జరిగినా, ఆ తర్వాత పేరు మార్చి జిల్లా సమీక్షా కమిటి సమావేశం జరిగినా ప్రజాప్రతినిధులంతా అత్యంత కీలకంగా భావించేవారు. సమావేశంలో నిర్ణయాలు ఇట్టే అమలవుతాయని భావించేవారు. ఆ దిశగానే అనేక సమస్యలను ఎమ్మెల్యేలతో సహా మిగతా ప్రజాప్రతినిధులు నేరుగా ప్రస్తావించేవారు. ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించే వారి దృష్టికి తీసుకెళ్లేవారు. ఆయన ఆదేశాలు యంత్రాంగం తుచ తప్పకుండా పాటించడంతో మరుసటి సమావేశానికి ఫలితాలు కనిపించేవి. ఇప్పుడు రానురాను ఉమ్మడి జిల్లాలు విడిపోయిన తర్వాత ఈ సమావేశాల తీరు మారింది.!

సమీక్షా సమావేశాల్లో జరుగుతుందేంటి?

- ఒకనాటి సీరియస్ చర్చలు, నిర్ణయాలేవి?
- ఫలితాలొచ్చేసరికి అంతా వెతుకులాటే
- ఏకపక్షమే.. అవరోధానికి మూలం
- మార్పు కోరుతున్నా.. అత్తెసరు అడుగులే
- యంత్రాంగంలో తగ్గిన చొరవ, వేగం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జిల్లా సమీక్ష కమిటీ సమావేశాల్లో నిర్ణయాల అమలులో తేడా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతీ మూడు నెలలకు ఒకమారు జిల్లా సమీక్షా సమావేశం విధిగా నిర్వహించాలి. కానీ సమావేశం దృష్టికి వచ్చిన అనేక సమస్యలు కొన్నింటికి పరిష్కారం కాగా, మరికొన్ని అలాగే మిగిలిపోతున్నాయి.

నిర్ణయాలు సరే.. అమలేది?

జిల్లాస్థాయిలో నిర్వహించే సమీక్షా కమిటీ సమావేశాలు ఇప్పటి వరకు కీలకంగా భావిస్తూ వచ్చారు. గడిచిన ఐదేళ్ల పాలనతో పోల్చితే ఈ సారి పెనుమార్పు ఉంటుందని అందరూ భావించారు. తగ్గట్టుగానే నిర్ణయాలు, ఫలితాలు ఉంటాయని ఆశించారు. ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో సమావేశాలు జరుగుతాయి కాబట్టి అమలులో తిరుగుండదనకున్నారు. సాధారణంగా గతంలో అధికార, ప్రతిపక్ష హోదాల్లో ఎమ్మెల్యేలు ఉండేవారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు నేరుగా అనేక సమస్యలను లేవనెత్తడమే కాకుండా, వాటి పరిష్కారానికి పట్టుబట్టేవారు. అంతకంటే మించి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి సాధించేవారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, జిల్లాలో ఎమ్మెల్యేలంతా ఏకపక్షంగా ఆ పార్టీ వారే గెలిచారు. దీనితో ఈ తరహా సమావేశాల్లో పస తగ్గింది. ప్రభుత్వాన్ని నిలదీసే ధోరణి మాయమైంది. సమస్యల ప్రస్తావన, నిర్ణయాలన్నీ సాదాసీదాగా మారాయి. అధికారంలో ఉన్నారు కాబట్టి ఎమ్మెల్యేలెవరు ఇలాంటి వేదికల మీద గళం విప్పి మాట్లాడడం అరుదే. వైసీపీ ఎమ్మెల్యేలంతా ఐదేళ్ల ఇలాగే వ్యవహరించారు. కీలక సమస్యలు కూడా ప్రస్తావించేందుకు సాహసించలేకపోయారు. ఫలితంగా సమావేశాల్లో తీర్మానాలు నామమాత్రంగానే జరిగేవి. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతోపాటు టీడీపీ, భాగస్వామ్యపక్షాలు ఏకపక్షంగా గెలుపొందాయి. అప్పటికి ఇప్పటికి కొంత తేడా ఉన్నప్పటికి ప్రజా సమస్యల ప్రస్తావనలో ఒకప్పటి చురుకుదనం తగ్గింది. వాస్తవానికి జిల్లాస్థాయిలో జరిగే ఈ తరహా సమావేశాలకు తమ నియోజకవర్గాల్లో పేరుకుపోయి ఉన్న సమస్యలను నేరుగా సమావేశంలో చర్చించడం, తాము పట్టుబడితే సాధిస్తామని నానుడి నియోజకవర్గ వాసుల్లో ఉండేందుకు ఎమ్మెల్యేలు ప్రయత్నించేవారు. కూటమి ప్రభుత్వంలో సాదాసీదా సమస్యలను ప్రతీసారి ప్రస్తావిస్తున్నారు. సాధారణంగా రైతులు, స్థానికంగా ఉన్న డిమాండ్లను ప్రధానంగా చర్చించాల్సిన కాస్త మిన్నకుండిపోతున్నారు. గత జిల్లా సమీక్షా కమిటి సమావేశంలో ఉప్పుటేరు సమస్యను కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రధానంగా ప్రస్తావించారు. ఉప్పుటేరు మీదుగా సముద్రపు నీరు కొల్లేరులోకి ఎగబాకితే ఎదురవుతున్న సమస్యలను ఆయన ప్రస్తావించారు. దీనికి విరుగుడుగా సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అత్యున్నతస్థాయిలో దీనిపై చర్చించి, తుది నిర్ణయం జరగాల్సి ఉన్న ఇప్పటిదాకా జరిగిన దాఖల్లాలు లేనేలేవు. ఉప్పుటేరు సమస్య ఇంకా వెన్నాడుతూనే ఉంది. ఇదొక్కటే కాదు అనేక సమస్యలు ప్రస్తావన జరిగినా, వీటి పరిష్కారానికి పడిన అడుగులు నామమాత్రమే.

అంతర్గత చర్చలేవి?

ఈ తరహా జిల్లాస్థాయి సమావేశాలు జరుగుతున్నప్పుడు అజెండా మేరకు చర్చ సాగాల్సిఉంది. ఇన్‌చార్జి మంత్రిగా ఎవరైతే వ్యవహరిస్తారో వారంతా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలతో సహా అంతర్గత సమావేశాలు నిర్వహించేవారు. ముందుగానే ఆరా తీసి వాటి సాధ్యాసాధ్యాలను బేరీజు వేసుకుని తగు నిర్ణయాలకు దిగేవారు. ఎవరైతే అత్యవసరం, కీలకాంశాలను ప్రస్తావిస్తారో వాటిపై కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసేవారు. ఇప్పటికీ ఆ పద్ధతి కొనసాగుతున్నా

మిగతా 8వ పేజీలో..

చింతలపల్లి పంచాయతీ నిధులు గల్లంతు


- సర్పంచ్, సర్పంచ్ భార్య ఖాతాలో రూ. 22 లక్షలు జమ
- అంగీకరించిన పంచాయతీ కార్యదర్శి

(నూజివీడు ఆంధ్రజ్యోతి)

ఏలూరు జిల్లా ముసునూరు మండలం చింతలపల్లి పంచాయతీలో పెద్ద ఎత్తున నిధులు గల్లంతయ్యాయి. 2021-22 నుంచి 2024-25 వరకు పంచాయితీకి రూ.1.12 కోట్ల ఆదాయం ఉంది. వీటిలో రూ.68,48,223 మొత్తానికి మాత్రమే బిల్లులు ఉన్నట్లు ప్రస్తుత విచారణలో తేలింది. వాటిలో కూడా లక్షలాది రూపాయిలు బిల్లులు నకిలీగా నిర్ధారణ అయినట్లు సమాచారం. అప్పటి గ్రామ కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు తాను రూ.22 లక్షలు గ్రామ సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, ఆయన భార్య పిల్లి స్వప్న బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు ఈనెల 15న ముసునూరు మండల అభివృద్ధి అధికారికి రాతపూర్వకంగా తెలియజేశారు. పంచాయితీ నిధులను తన ఖాతాలో జమ చేయలేదని గ్రామ కార్యదర్శి విచారణలో తెలిపారు. తనకు మండలంలో ఐదు గ్రామాల బాధ్యతలను అప్పజెప్పడం వల్ల బిల్లుల పరిశీలన చేయలేకపోయానని ఆ లేఖలో ఆయన తెలిపారు.

దుర్వినియోగం తేల్చాలి..!

ఇప్పటికి వరకు జరిగిన విచారణలో రూ.68,48,223 బిల్లులలో అనేకం నకిలీ కాగా లెక్క తెలియని అవినీతి నిర్ధారణ కావాల్సి ఉంది. గ్రామంలో ఏ అవసరం వచ్చినా నిధులు లేవని చెబుతుండడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు గల్లంతైనట్లు ప్రాథమిక విచారణలో తేలినా ఇంత వరకు పంచాయితీ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ గ్రామ కార్యదర్శి పరిధిలో చింతలపల్లితో పాటు మండలంలో లోపూడి, చెక్కపల్లి, సూరేపల్లి, వేలుచర్ల, ముసునూరు, గోపవరం గ్రామాలలో సైతం ఉన్నాయి. వీటిలో ఇప్పటికే వేల్పుచర్ల, సూరేపల్లి గ్రామాలలో సైతం నిధులు గల్లంతు అయ్యాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. వీటిపైన విచారణ నత్తనడక నడుస్తోంది. ఈకార్యదర్శి పరిధిలోని గ్రామాలలో పంచాయితీ నిధులపై ఆడిట్ జరిపితే పంచాయితీ నిధులు ఎంత వరకు సక్రమంగా వినియోగించబడ్డాయి. ఎంత వరకు పక్కదారి పట్టాయి అనేది బట్ట బయలవుతుంది. నిధుల గల్లంతుపై ముసునూరు ఎంపీడీవో వివరణ కోసం ఆంధ్రజ్యోతి ఆదివారం ప్రయత్నించగా మంత్రి పార్థసారథి పర్యటనలో ఉండడంతో అందుబాటులోకి రాలేదు. కాగా ఎంపీడీవోకు లిఖితపూర్వకంగా తెలియజేసినట్లు గ్రామ కార్యదర్శి ఆర్ వెంకటేశ్వరరావు నిర్ధారించారు.


రాజకీయ ఒత్తిడితో నిధులు మళ్లించినట్లు ఎంపీడీవోకి గ్రామ కార్యదర్శి రాత ప్రతి

నకిలీ ఇంటి పన్ను రసీదు

మా వద్ద రూ.7,069 ఇంటి పన్ను వసూలు చేసి నకిలీ రసీదు ఇచ్చారని గ్రామానికి చెందిన బండారు నాగేశ్వరరావు తెలిపారు. ఏసు రంగారావు కూడా తనకు ఇచ్చిన నకిలీ ఇంటి పన్ను రసీదులను చూపారు.

కాగుపాడు సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ఉంగుటూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం కాగుపాడు గ్రామ సర్పంచ్ కడియాల సుదేష్ణ చెక్ పవర్ ఆరు నెలల పాటు రద్దు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. వార్డు సభ్యుడు వంకిన మాధవరావు పిర్యాదు మేరకు నూజివీడు డివిజ నల్ అధికారిని విచారణాధికారిగా నియమించారు. నివేదిక ఆధారంగా డీపీవో అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. అవకతవకలపై మరోసారి విచారణ జరపాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. నిధుల దుర్వినియోగంపై సర్పంచ్ సుదేష్ణ, అప్పటి కార్యదర్శుల నుంచి రికవరీకి చర్యలు తీసుకోవాలని సూచించారు.



వైభవంగా మంత్రి నిమ్మల కుమార్తె నిశ్చితార్థం
మంత్రి లోకేశ్ హాజరు

భక్తులతో కిటకిటలాడిన గుబ్బల మంగమ్మ చిన వెంకన్న ఆలయాలు
జోరు వానలో వచ్చిన భక్తులు
వరస సెలవుల ప్రభావం



లోపలి పేజీల్లో

తమ్మిలేరులో చిక్కిన భారీ చేప


మత్స్యకారులకు చిక్కిన చేప

చాట్రాయి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తమ్మిలేరు ప్రాజెక్టులోకి ఆదివారం చేపల వేటకు వెళ్లిన పోతనపల్లి మత్స్యకారులకు భారీ చేప చిక్కింది. వాలగ జాతికి చెందిన ఈ చేప బరువు సుమారు 20 కేజీలు ఉందని, ఇటువంటి చేపలు అరుదుగా దొరుకుతుంటాయని, ఇది రూ.4 వేలకు అమ్ముడుపోయినట్టు మత్స్యకారులు చెప్పారు. తమ్మిలేరు ప్రాజెక్టుకు వరద వస్తున్నందున జలాశయంలోను, ఏటిఒడ్డు గ్రామాల్లో జోరుగా చేపల వేట సాగుతోంది.

పెరిగిన ఉల్లి

» మహారాష్ట్రలో వర్షాల ప్రభావం
» తాడేపల్లిగూడెం మార్కెట్‌లో క్వింటా రూ.1800 నుంచి రూ.2400 వరకు అమ్మకాలు



తాడేపల్లిగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : ఉల్లి ధర మార్కెట్లో పెరిగింది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో ధరలు పెరిగాయి. తాడేపల్లిగూడెంలో గత వారం క్వింటా రూ.1400 నుంచి రూ.1700 మధ్య హోల్‌సేల్‌గా విక్రయించారు. ఈ వారం క్వింటా రూ.1800 నుంచి రూ.2400 మధ్య విక్రయాలు జరిగాయి. రిటైల్ వ్యాపారులు వీటిని రెండు రకాలు కలిపి రూ.100కు నాలుగు కిలోల చొప్పున అమ్ముతున్నారు. మహారాష్ట్రంలో కురిసిన వర్షాలకు కొంతమేరకు ఉల్లి దెబ్బతింది. గోదాముల్లో కుదవబెట్టిన ఉల్లి మాత్రం ఇప్పుడు మార్కెట్‌కు రావడంతో ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పుడు మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి రోజూ 7 నుంచి 11 లారీలు మాత్రమే వస్తున్నాయి. ఇక కర్నూలు నుంచి ఉల్లి ఆగస్టు 15నుంచి మార్కెట్‌కు వస్తుందని వ్యాపారులు ఎదురు చూశారు. కాని ధర పడిపోతుందనే భయంతో రైతులు ఇంకా అమ్మకాలు మొదలు పెట్టలేదు. నిల్వలు వేసుకుని అక్కడ రైతులు కూర్చున్నారు. ధర పెరిగిన తరువాత అమ్మకాలు కొనసాగిద్దామనే ధీమాలో కర్నూలు రైతులు ఉన్నారు. ఈమేరకు మార్కెట్‌కు కర్నూలు ఉల్లి రావడం లేదు. ఇక పెద్ద దిక్కుగా మహారాష్ట్ర ఉల్లే ఉంది. కర్నూలు ఉల్లి వస్తే ధర పడిపోతుందని వ్యాపారులు చూస్తున్నారు.

నిలకడగా కూరగాయల ధరలు

కూరగాయల ధరలు ఈ వారం పెద్ద మార్పులేదు. పచ్చిమిర్చి మాత్రం కిలోకు రూ.30 పెరిగింది. గత వారం కిలో రూ.50 ఉండే పచ్చిమిర్చి ఈవారం రూ.80కు పెరిగింది. బీరకాయలు కిలోకి రూ.10 పెరిగింది. గతవారం కిలో రూ.30 ఉంటే ఈవారం రూ.40కు విక్రయించారు. తెల్లవంకాయలు కిలో రూ.50, నల్లవంకాయలు రూ.40, బెండ రూ.30, దొండ రూ.30 టమాటా కిలో రూ.40 నుంచి రూ.50 మధ్య అమ్మకాలు జరిగాయి. కాకర కాయలు కిలో రూ.50 చొప్పున అమ్మకాలు జరిపారు.

పెరిగిన బ్రాయిలర్ చికెన్

బ్రాయిలర్ చికెన్ ధర కిలోకు రూ.20 పెరిగింది. గత వారం కిలో రూ.200 ఉండగా ఈ వారం రూ.220కు విక్రయించారు. లేయర్స్ మాత్రం ధర నిలకడగానే ఉంది. లేయర్ కిలో రూ.200కు విక్రయిస్తున్నారు.

టీచరు డిప్యుటేషన్‌పై ఏపీటీఎఫ్ అభ్యంతరం

ఏలూరు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా పెదవేగి మండలం రామచంద్రాపురం జడ్పీ హైస్కూలులో సోషల్ స్టడీస్ బోధిస్తున్న టీచరును మౌఖిక ఆదేశాలతో పెదవేగి జడ్పీ హైస్కూలు ప్లస్‌కు మండల విద్యాధికారి డిప్యుటేషన్‌పై పంపడాన్ని ఏపీటీఎఫ్-1938 నాయకులు జి.కృష్ణ, రామ్మోహనరావు, మోహన్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. రామచంద్రాపురం హైస్కూలులో వంద మంది విద్యార్థులకు సోషల్‌స్టడీస్ సబ్జెక్టును బోధించేందుకువున్న ఒకే ఒక్క టీచరును మరో పాఠశాలలో ఇంటర్మీడియట్ కామర్స్ సబ్జెక్టును బోధించడానికి ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే పెదవేగి జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఇద్దరు సోషల్ సబ్జెక్టు టీచర్లు పనిచేస్తుండగా, నిబంధనలకు విరుద్ధంగా రామచంద్రాపురం స్కూలు టీచరుకు డిప్యుటేషన్ ఉత్తర్వులు జారీ చేసిన ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


తాడేపల్లిగూడెంలో జెండా ఎగురవేసిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు

పోరాటాలు చేసిన చరిత్ర ఏపీయూడబ్ల్యూజేదే

» ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందర్

తాడేపల్లిగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే)దేనని ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ పేర్కొన్నారు. యూనియన్ 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక గాంధీ మండపంలో యూనియన్ పతాకాన్ని సీనియర్ పాత్రికేయుడు షేక్ ఖాదర్ మొహిద్దీన్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1957 ఆగస్టు 17న ఆవిర్భవించిన ఏపీయూడబ్ల్యూజే గత 68ఏళ్లుగా జర్నలిస్టులకు సంబంధించి ఎన్నో సమస్యలు పరిష్కరించిందన్నారు. యూనియన్ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు యడ్లపల్లి మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి గణపతి వరప్రసాద్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి గొలిమే బుజ్జిబాబు, ఎలక్ట్రానిక్ మీడియా మాజీ అధ్యక్షుడు పాలడుగు సతీశ్, ప్రెస్‌క్లబ్ పూర్వాధ్యక్షుడు చిట్యాల రాంబాబు మాట్లాడారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌వీ లక్ష్మయ్య, శీలిరాజు, ఏవీ రామరాజు, తేతలి గంగాధరరెడ్డి, యద్దనపూడి సుబ్బారావు, ఎం.రవికిరణ్, కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

» భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం


శ్రీవారి వకుళమాత అన్నప్రసాద భవనంలో భోజనాలు చేస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కళకళలాడింది. సెలవురోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయంలో గోవింద నామస్మరణ మార్మోగింది. దాదాపు 15వేల మందికి పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది. సాయంత్రం నుంచి రద్దీ కాస్త తగ్గుముఖం పట్టింది. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తుండడంతో భక్తులు తడుస్తూనే ఆలయంలో రాకపోకలు సాగించారు.

22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

శ్రీవారి ఆలయ అనివేటి మండప ఆవరణలో ఈనెల 22న సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. శ్రావణమాసంలో ఆఖరి శుక్రవారం కావడంతో మహిళాభక్తులతో ఉచితంగా పూజలు నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆ రోజున ఉదయం 9.30 గంటల నుంచి వ్రతాలు నిర్వహిస్తామన్నారు. మహిళా భక్తులు ముందుగా తమ పేర్లను స్థానిక పాదుకా మండపం వద్దనున్న సమాచారకేంద్రంలో నమోదు చేయించుకోవాలని కోరారు.

నేటి నుంచి లక్ష్మీపురం శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు

పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ స్వామి ఆలయంలో శ్రీనివాసుని దివ్య పవి త్రోత్సవాలు సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభ మవుతాయని ఆలయ ఈవో సత్యనారాయణ మూర్తి తెలిపారు. వీటిని ఈనెల 21 వరకు నాలుగురోజుల పాటు నిర్వహించనున్నారు. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసి తెలియక జరిగిన తప్పుల ప్రాయఃచిత్తం నిమిత్తం ప్రతీ ఏటా వీటిని నిర్వహించడం సంప్రదాయం. ఉత్సవాల్లో భాగంగా 18న సాయంత్రం అంకురా ర్పణ, 19న పవిత్రాధివాసం, 20న పవిత్రారోపణ, 21న జరిగే శ్రీమహాపూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలిపారు.


గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మకు భక్తుల రద్దీ

బుట్టాయగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో వున్న వనదేవత గుబ్బల మంగమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల ఏజెన్సీలో వర్షాలు కురుస్తున్నందున అమ్మవారి దర్శనాలకు వచ్చే భక్తులు సంఖ్య రెండు వారాలపాటు తగ్గింది. ఆదివారం ఉదయం వాతావరణం పొడిగా ఉండడంతో భక్తులు అధికంగానే దర్శనాలకు తరలివచ్చారు. దర్శనం అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం నుంచి వర్షాలు ప్రారంభం కావడంతో అటవీ ప్రాంతం నుంచి త్వరగా బయటకు వెళ్లాలని ఆలయ కమిటీవారు తెలపడంతో సాయంత్రం నాలుగు గంటలలోపు భక్తులు తమ ఇళ్లకు బయలుదేరారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను కమిటీ వారు పర్యవేక్షించారు.

రిటైర్డు ఉద్యోగులు, కార్మికులపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

» సెప్టెంబరు 13న విజయవాడలో రాష్ట్ర సదస్సు : సత్తిరాజు


సమావేశంలో మాట్లాడుతున్న సత్తిరాజు

భీమవరంటౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, పరిపాలనకు దోహదపడి ఏళ్ల తరబడి సేవలు చేసిన రిటైర్డు ఉద్యోగులు, కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సత్తిరాజు ఆరోపించారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో టి. గంగరాజు అధ్యక్షతన అసోసియేషన్ జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్‌లో 95శాతం పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు ఉంటే ప్రతి ఏడాది వడ్డీ కింద రూ.54వేల కోట్ల వస్తుంటే కేవలం రూ.14 వేల కోట్లతో పెన్షన్లు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికుల్ని మోసం చేయడమేనన్నారు. రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తుంటే ఎన్నికల ముందు వాగ్దానాలు చేస్తున్న పాలకులు అనంతరం విస్మరించడం తగదన్నారు. వచ్చేనెల 13న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.జేమ్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.అజయ్‌కుమార్, రిటైర్డు ఉద్యోగులు, తదితరులు మాట్లాడారు.

ఎరువుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి

» ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్‌బాషా


ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరుసిటీ/కామవరపు కోట, ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో రైతులకు విక్రయించిన ఎరువుల వివరాలను ఐఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎరువుల డీలర్లకు ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్‌బాషా ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఎరువులు షాపులను తనిఖీ చేస్తున్నట్లు ఆదివారం తెలిపారు. డీలర్లు రైతులకు యూరియా, ఇతర ఎరువులను విక్రయించిన తక్షణమే ఐఎఫ్‌ఎంఎస్ పోర్టల్ నందు రైతు ఆధార్ సహాయంతో ఈ-పోస్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. కానీ జిల్లాలో డీలర్లు ఎరువులను విక్రయించిన తర్వాత ఆ వివరాలను సదరు పోర్టల్‌లో నమోదు చేయకపోవడం వల్ల జిల్లాకు ఎరువుల కేటాయింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈమేరకు జిల్లాలోని కామవరపుకోట మండలం తడికలపూడి, కామవరపుకోట, గ్రామాల్లోనూ, పెదవేగి మండలంలోని ఎరువుల షాపులను ఆకస్మిక తనిఖీలు చేసి కొంతమంది డీలర్ల వద్ద వ్యత్యాసాలు ఉన్నట్లు గమనించామన్నారు. సదరు మండల వ్యవసాయ శాఖ అధికారులను తక్షణమే ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో రికార్డు చేయాలని ఆదేశించారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నూజివీడు టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):ఒంగోలులో ఈనెల 20 నుంచి 25 వరకు జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం నూజివీడులో పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఈ మహాసభల్లో ఎంపికయ్యే రాష్ట్ర సీపీఐ నూతన నాయకత్వం మహాసభ వేదికగా రాష్ట్ర భవిష్యత్‌కు మార్గదర్శకత్వం చేసే పద్ధతిలో పలు తీర్మానాలను ఆమోదించనుందని అన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకుడు గుంట సుబ్బారావు పాల్గొన్నారు.

కుమారుడి అదృశ్యం.. కేసు నమోదు

భీమవరం క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు ఈనెల 16వ తేదీ నుంచి కనిపించడం లేదని స్థానిక గాంధీ నగర్‌కు చెందిన బొర్రా పెద్దిలక్ష్మి టూటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పెద్దిలక్ష్మి కుమారుడు దుర్గా నరసింహస్వామి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తొమ్మిదేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. ఈమధ్య కాలంలో మతిస్థిమితం లేకపోవడంతో ఈనెల 16వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అన్నిచోట్లా వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

తండ్రి అదృశ్యంపై కుమారుడి ఫిర్యాదు

ఉండి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):తన తండ్రి కనిపించడం లేదని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. ఆదివారం రాత్రి పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండి గ్రామానికి చెందిన జోగి కాశీవిశ్వేశ్వరరావు అనే వృద్ధుడు ఒంటరిగా ఉంటున్నాడు. ఆయన భార్య హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు జోగి దుర్గారావును చూసేందుకు వెళ్లడంతో అప్పటినుంచి తండ్రి ఉండిలో ఒంటరిగానే వుంటున్నాడు. ఈనెల ఏడో తేదీన గ్రామంలో వుంటున్న తండ్రికి ఫోన్ చేయగా సమాచారం రాలేదు. అప్పటినుంచి ఆచూకీ లభ్యంకాలేదు. ఈ మేరకు ఉండిలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



ఐటి మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి నిమ్మల.. వధూవరులతో మంత్రి లోకేశ్ తదితరులు

వైభవంగా మంత్రి నిమ్మల కుమార్తె నిశ్చితార్థం

పాలకొల్లు/పాలకొల్లు అర్బన్/పాలకొల్లు టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఇంట పెండ్లి సందడి మొదలైంది. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని కల్యాణ మండపంలో మంత్రి నిమ్మల రామానాయుడు, సూర్యకుమారి దంపతుల కుమార్తె శ్రీజ నిశ్చయ తాంబూలాల వేడుక వైభవంగా జరిగింది. వీరవాసరం మండలం తోలేరు గ్రామానికి చెందిన యిర్రింకి వెంకట సూర్యనారాయణ, కరుణమణి దంపతుల కుమారుడు పవన్‌కు వివాహ నిశ్చయ తాంబూలాలను బంధు,మిత్రుల మధ్య స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను గజమాల, పూల బొకేలతో ఘన స్వాగతం పలికి మహిళలు పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా శ్రీజ, పవన్‌లకు లోకేశ్ అక్షింతలు వేసి ఆశీర్వదించారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

పార్టీ చొక్కాతోనే డాక్టర్ నిమ్మల

ప్రజా జీవితంలో రాజకీయ నాయకులకు కొన్ని సిద్ధాంతాలు, నిబద్ధత ఉంటాయి. ఆ నిబద్ధతను జీవితంలో ప్రతీ సందర్భంలోనూ పాటించడం చాలా అరుదుగా చూస్తుంటాం. అటువంటి వ్యక్తిత్వం మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుది. టీడీపీ నాయకుడిగా, రాష్ట్ర మంత్రిగా నిత్యం పార్టీ రంగు అయిన పసుపు చొక్కానే ధరించి కనిపిస్తారు. తాజాగా తన కుమార్తె వివాహ నిశ్చితార్థంలోనూ అదే పసుపు చొక్కాతో కనిపించడం ఆయన నిబద్ధతకు, పార్టీ పట్ల ఆయనకున్న విశ్వాసానికి నిదర్శనం.

విస్తృతంగా వాహనాల తనిఖీలు


ఏలూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సత్యనారాయణ

ఏలూరు క్రైం, ఆగస్టు17 (ఆంధ్ర జ్యోతి): ఏలూరు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదార్లపై పోలీసులు ఆదివారం సాయంత్రం విస్తృతంగా వాహ నాల తనిఖీలు నిర్వహించారు. అక్రమ మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్సు రికార్డులతో పాటు ఇన్సూరెన్స్ కచ్చితంగా ఉండాలని సూచించారు.

23,24 తేదీల్లో వాలీబాల్ పోటీలు

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 23,24వ తేదీల్లో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 14 ఏళ్ల పైబడిన వారే పోటీలలో పాల్గొనే అవకాశం కల్పించినట్టు తెలిపారు. క్లస్టర్ స్థాయిలో నిర్వహించే పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.పదివేలు, ద్వితీయ బహుమతి రూ.ఏడు వేలు, తృతీయ బహుమతి రూ.ఐదు వేలు, నాలుగో బహుమతి రూ.మూడు వేలుగా నిర్ణయించారు. విజేతలుగా నిలిచిన వారు సెప్టెంబరులో గుంటూరులో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఫైనల్ పోటీలను సెప్టెంబరు 21న తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫైనల్ విజేతలకు మొదటి బహుమతిగా రూ.5లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.3 లక్షలు, తృతీయ బహుమతిగా లక్ష రూపాయలు అందిస్తామన్నారు. ఉత్సాహవంతులైన గ్రామీణ, పట్టణ ప్రాంత యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఇషా ఫౌండేషన్ వలంటీర్లు సత్య గంగాధర్, జయసాయి ప్రసాద్ కోరారు. మరిన్ని వివరాలకు 95819 01043, 93461 87098 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని ట్యాంకర్ లారీ బోల్తా


రమణక్కపేట వద్ద పడిన ట్యాంకర్ లారీ

జీలుగుమిల్లి, ఆగస్టు 17: (ఆంధ్ర జ్యోతి): జీలుగుమిల్లి మండలం రమణక్కపేట వద్ద రోడ్డు ప్రమాదంలో ట్యాంకర్ లారీ బోల్తా పడింది. ఆదివారం జీలుగుమిల్లి నుంచి జంగారెడ్డిగూడెం వైపు ఖాళీ ట్యాంకర్ లారీ వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈమేరకు ట్యాంకర్ లారీ రోడ్డు మార్జిన్‌లో పడి తిరగబడింది. ఢీకొని గుర్తుతెలియని లారీ వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ లారీలో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ వి.క్రాంతికుమార్ పరిశీలించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



ఏలూరుక్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఏలూరు మార్కెట్ యార్డు సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాలివి.. చెన్నైకి చెందిన రియ్యల మునిబాబు(46) ఆరేళ్ల క్రితం తన భార్య పిల్లలతో గొడవపడి ఏలూరులోని మార్కెట్ యార్డు సమీపంలో వీవీ నగర్‌లో ఒక గదిని అద్దెకి తీసుకుని నివాసముంటున్నాడు. బ్రాందీ షాపులో పనిచేస్తున్నాడు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. ఈనెల 15వ తేదీ నుంచి షాపు వద్దకు పనికి వెళ్లడం లేదు. మద్యం తాగి గదిలోనే పడుకుని ఉన్నాడు. ఆదివారం రాత్రి ఆ గది నుంచి దుర్గంధం వెదజల్లడంతో చుట్టుపక్కల వారు గమనించి ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు ఘటన స్థలాన్ని ఎస్ఐ పరిశీలించి, మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

క్రైం సమాచారం

ఆగిన లారీని ఢీకొట్టిన మరో లారీ

» డ్రైవర్, క్లీనర్ మృతి


ప్రమాదానికి గురైన కొబ్బరికాయల లారీ

కొయ్యలగూడెం, ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టిన ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ మృతి చెందిన ఘటన కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం జాతీయ రహదారిలో పవర్‌గ్రిడ్ వద్ద జరిగింది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలివి.. ఆదివారం తెల్లవారు జామున పాలకొల్లు నుంచి కొబ్బరికాయల లోడుతో హైదరాబాద్‌కు లారీ వెళ్తుంది. ఈ లారీ ఆదివారం అర్ధరాత్రి కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెం దగ్గర పవర్‌గ్రిడ్ వద్దకు వచ్చేసరికి లోడు ఒరిగి ఉండడంతో లారీని నిలుపుదల చేసి డ్రైవరు, క్లీనరు దిగి కొబ్బరికాయల లోడు సరిచేసుకుంటున్నారు. అదే సమయంలో మరో లారీ వేగంగా ఢీకొనడంతో డ్రైవరు, క్లీనర్ తీవ్రగాయాలయ్యాయి. మృతి చెందిన వారిలో డ్రైవర్ పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కరుగోరుమిల్లి గ్రామానికి చెందిన నౌడి రాజేశ్ (30) అదే మండలం కోడేరు గ్రామానికి చెందిన క్లీనర్ కొడదాసి లక్ష్మణరావు (35) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిఇద్దరి పైనుంచి వాహనాలు వెళ్లిపోవడంతో మృతదేహాలు నుజ్జునుజ్జయి గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాలను పక్కకు తీశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



టి.నరసాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన టి.నరసాపురం మండలంలో ఆదివారం జరిగింది. టి.నరసాపురం పంచాయతీలోని కె.రామన్నపాలెం గ్రామంలో కొరివి ప్రసాద్‌కు చెందిన పాడిగేదెను మేత కోసం జాడు చేనులోకి తోలగా అప్పటికే కొబ్బరి మట్టపడి తెగిన కరెంట్ వైరుకు పాడిగేదె తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గేదె సుమారు లక్షా 20 వేలు రూపాయల విలువ ఉంటుందని తెలిపారు.

పిచ్చి కుక్క స్వైర విహారం.. 31 మందికి గాయాలు


పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న డాక్టర్


కాలుపై కరిచిన దృశ్యం

పాలకొల్లుటౌన్,ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం పిచ్చికుక్క కాటుకు పలువురు గాయపడ్డారు. పెద్దగోపురం పరిసరాల్లో స్థానికులను ఆదివారం ఉదయం ఒక పిచ్చికుక్క కరిచిందని స్థానికులు, బాధితులు తెలిపారు. వాహనాలపై వెళ్లేవారిని తరమడం, నడిచి వెళ్లేవారిని కరుస్తూ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. సమాచారం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ విజయ సారథి వెంటనే స్పందించి కుక్కలను పట్టుకునే వారి సహకారంతో గోపురం పరిసరాల్లో గాలించి కుక్కను పట్టుకున్నారు. సుమారు 40 మందిని కుక్క కరిచిందని సమాచారం. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు సుష్మ మాట్లాడుతూ ఆసుపత్రిలో 31 మందికి ర్యాబిస్ వ్యాక్సిన్ వేసి వైద్యం అందించినట్టు తెలిపారు. మిగిలిన వారు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి ఉండవచ్చని సమాచారం

పామాయిల్ గెలల చోరీ


పామాయిల్ గెలలను చోరీ చేసి ట్రాక్టర్‌పై తరలిస్తున్న దృశ్యం

ముసునూరు,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలంలోని గోపవరం శివారు పెద్దపాటివారిగూడెంకు చెందిన రైతు వడ్లపట్ల వెంకటేశ్వర రావు తన 3.5 ఎకరాల్లో పామాయిల్ పంట వేసుకుని జీవిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఆగంతుకులు పామాయిల్ గెలలను కట్ చేసి ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా తోటలోకి వచ్చిన పాలేరు కొత్తూరు జీయన్ రైతుకు సమాచారం ఇచ్చాడు. రైతు, అతడి కుమారుడు గణేష్ వచ్చే సరికి పామాయిల్ గెలల లోడ్‌తో వారు పరారయ్యారు. గణేష్ వారిని వెంబడించి, బలివే వద్ద ట్రాక్టర్‌ను అడ్డుకోగా, డ్రైవర్‌తోపాటు మరికొంత మంది అతనిపై దాడిచేసి లోడ్‌తో పారిపోయారు. దీనిపై గణేష్ ఆరా తీయగా దెందులూరుకు చెందిన షైనేడు, సతీష్, తులసి, బాలాజీతోపాటు మరో ఐదుగురు చోరీకి పాల్పడినట్లు గుర్తించాడు. వీటి విలువ సుమారు రూ. 1.50 లక్షలు ఉంటుందని బాధిత రైతు ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ఏలూరు
ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు, చింతలపూడి, పోలవరం
www.andhrajyothy.com ● సోమవారం 18 ఆగస్టు 2025

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని నిమ్మలగూడెం, టెక్కినవారిగూడెం గ్రామాలకు త్రీఫేజ్ 24 గంటల లైన్ వేసే నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు విద్యుత్ శాఖ డీఈఈ పీర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిమ్మలగూడెం, టెక్కినవారిగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

మరికంటి గోపాలకృష్ణకు స్ఫూర్తి అవార్డు

చింతలపూడి, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి):సామాజిక కార్యకర్త మరికంటి గోపాలకృష్ణకు నెల్లూరు జిల్లాలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ 18వ వార్షికోత్సవం సందర్భంగా స్ఫూర్తి అవార్డు ప్రదానం చేశారు. ఏపీజే అబ్దుల్‌కలాం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు, విద్యార్థులకు అవగాహన సదస్సులు, రైతులకు ప్రకృతి వ్యవసా యంపై శిక్షణ ఇచ్చినందుకు అసోసియేషన్ అధ్యక్షులు ఎ.మురళీమోహన్‌రాజు అవార్డును, ప్రదానం చేశారు. ఈ మేరకు ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లింగపాలెం డాక్టర్ రాజశేఖర్ సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశముందని వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. వైద్య సిబ్బంది జ్వరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని తమకు కేటాయించిన గ్రామాల్లో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులపై ప్రజలకు తగిన సూచనలిస్తూ అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

28వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి

కామవరపుకోట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కె.కోట మండల సీపీఐ కన్వీనర్ టి.వి.ఎస్.రాజు పిలుపునిచ్చారు.ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. అనంతరం రాజు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రాంతాల అభివృద్ధి కోసం చర్చలు జరిపి రాష్ట్రాభివృద్ధి కోసం తీర్మానాలు చేస్తారని తెలిపారు. ఈ మహాసభలకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ తదితరులు హాజరవుతారన్నారు.



కేక్ కట్ చేస్తున్న యూనియన్ నాయకులు

ప్రజలకు, ప్రభుత్వాలకు వారధి ఏపీయూడబ్ల్యూజే

ఏలూరు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిలా ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) పని చేస్తోందని ఆ యూనియన్ నాయకులు తెలిపారు. యూనియన్ 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో సేవ కార్యక్రమం నిర్వహించారు. దొండపాడులోని పరివర్తన్ బధిరుల పాఠశాలలో యూనియన్ ఆవిర్భావ దినోత్సవ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజెప్పడం, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో యూనియన్‌కు చెందిన జర్నలిస్టులు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. సమర్థవంతమైన నాయకత్వంతో అత్యధిక సభ్యత్వాలతో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే దిశగా యూనియన్ గత 68 ఏళ్లుగా అవిశ్రాంత పోరాటాలు చేస్తోందన్నారు.యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేపీకే కిశోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాగిత మాణిక్యరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవీఎస్ఎన్ రాజు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శీర శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఊర్ల శ్రీను, జిల్లా సంయుక్త కార్యదర్శి సీహెచ్ రామకృష్ణంరాజు, ఏపీ ఫొటో జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కె.రియాజ్, ఫొటోగ్రాఫర్ కృష్ణ, గుజ్జు శ్రీధర్, బధిరుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అవసరమైతే తప్ప బయటకు రాకండి

» భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎమ్మెల్యేల దిశానిర్దేశం

దెందులూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు వ్యవసాయ అన్ని శాఖ అధికారులు ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులకు ఆదేశించారు. ఆదివారం క్యాంప్ కార్యాలయం నుంచి నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవో, వ్యవసాయశాఖ అధికారులకు సూచనలు చేశారు. ప్రజలు వర్షాకాలంలో విద్యుత్ స్తంభాల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

● ఏలూరు: భారీవర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెంలో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు చెరువులు, వాగుల వద్దకు వెళ్లకూడదన్నారు. పాత ఇళ్లలో గోడలు కూలే అవకాశం ఉంటే సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

ఘనంగా భక్తాంజనేయ ఆలయ వార్షికోత్సవం

దెందులూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):కొవ్వలి గ్రామంలో శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయ 16వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. భక్తాంజనేయ స్వామికి గ్రామస్థులు తపాలపాకులు, సింధూరం, పసుపు, కుంకుమ అర్చన, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పలు రకాల పండ్లు, పువ్వులను స్వామికి సమర్పించారు. కొవ్వలి భకాంజనేయ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కోలాటం, భజనలు నిర్వహించారు. అనంతరం ఆలయ అవరణలో స్వామి వారి ప్రసాదంతో పాటు భారీ అన్న సమారాధన నిర్వహించారు.

వరద భయం

(5వ పేజీ తరువాయి)

హెచ్చరికలు జారీ చేయాలన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదివారం పెద్దఎడ్లగాడి నుంచి బోటులో పెనుమాకలంక గ్రామానికి చేరుకుని వరద పరిస్థితిని పరిశీలించారు. తహసీల్దార్ గోపాల్ అధికారులతో కలిసి పెద్దఎడ్లగాడి రోడ్డు మార్గాన్ని పరిశీలించి వాహనదారులు ఈ మార్గంలో వెళ్లవద్దని హెచ్చరించారు. పోల్‌రాజ్ డ్రైన్ ఉధృతంగా ప్రవహించడంతో కొల్లేరులోనికి భారీగా వరదనీరు చేరుతుంది. సర్కారుకాలువ వద్ద ఉధృతంగా ప్రవహిస్తుండడమే గాక రెండు అంగుళాల మేర నీటి మట్టం పెరిగింది. ఎగువ నుంచి నీరు భారీగా చేరడంతో మరో రెండు, మూడురోజుల్లో కొల్లేరు సరస్సులోనికి వేల క్యూసెక్కుల నీరు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

పొంగిన పోల్‌రాజ్ డ్రెయిన్లు

కొల్లేరు సరస్సుకు వరద తాకిడితో పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్ గట్ల అంచులను తాకుతూ ప్రవహిస్తోంది. వర్షాలతో నీటి మట్టం మరింత పెరిగే అవకాశాలున్నాయి. కొమరవోలు డ్రెయిన్ నుంచి కూడా నీరు భారీగా పోల్‌రాజ్ డ్రెయిన్‌లో చేరుతోంది. పలుచోట్ల పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు తొలగించినా ఇసుక మేటలతో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. పలు మైనర్ డ్రెయిన్లలో నీటి ప్రవాహం స్తంభించింది.వందలాది ఎకరాల ఆయకట్టు ముంపు బారిన పడనుంది. ముదినేపల్లిలో మైనర్ డ్రెయిన్ పూడికతో పొలాల్లో ముంపు నీరు బయటకుపోవడం లేదు.

రాకపోకలు బంద్

ఎగువన వర్షపు నీటితో కొల్లేరులోకి భారీగా వరద నీరు ప్రవహించడంతో ఏలూరు రూరల్ మండలంలోని కోమటి లంక రహదారి కొట్టుకుపోయింది. రాకపోకలు నిలిచిపోవ డంతో అత్యవసర పనులకు గ్రామస్తులు పడవలో వెళుతు న్నారు. వాగు పొంగి ప్రవహించడంతో వైద్యం కోసం గర్భిణులు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

తీరు మారింది!

(5వ పేజీ తరువాయి)

జిల్లాస్థాయిలో కొందరు అధికారుల తీరు నామమాత్రంగా మారడంతో నిర్ణయాలేవి ఫలవంతం కావడం లేదు. గత సమావేశంలో డ్రాప ఫుట్లను తగ్గించి, అడ్మిషన్ల పెంచాలని భావించినా ఆ మేరకు లక్ష్యాలను అందుకోలేకపోయారు. సాగునీటి కాల్వల నిర్వహణలోనే ఇదే సాగింది. ప్రస్తుత ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న నాదెండ్ల మనోహర్ సాధ్యమైనంత మేర జిల్లాలో ప్రధాన సమస్యలపై గత సమావేశంలోను అధికారులకు తగు మార్గనిర్దేశం చేసినా, కొన్ని అంశాల్లో ఇంకా జాప్యమే. సోమవారం మరోమారు జిల్లా సమీక్షా కమిటి సమావేశం జరగబోతుంది. ఇప్పటికే ఉపాధిహామీ కింద కూలీలకు ఇవ్వాల్సిన వేతన బకాయిలు కొనసాగుతున్నాయి. కొల్లేరు సమస్య, ఉప్పటేరు సమస్య తొంగి చూస్తున్నాయి. ఈ సారి వ్యవసాయం, అనుబంధంగా ఉద్యానవన, ఉపాధి వంటి అంశాలపై చర్చించబోతున్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలుపైనే ఇన్‌చార్జి మంత్రిగా ఆయన దృష్టిపెట్టి వివరాలు రాబడితే సమావేశ లక్ష్యాలు ఎంత మేర తీరుతున్నాయనేది బహిర్గతం కావడం ఖాయం.

నరకం చూస్తున్నారు..

● గోతులమయంగా బుట్టాయగూడెం - జంగారెడ్డిగూడెం రోడ్డు ● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

బుట్టాయగూడెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం - జంగారెడ్డిగూడెం ప్రాంతాల మధ్య ఉన్న ప్రధాన రహదారి దుస్థితి మరలా మొదటికొచ్చిందని ఏజెన్సీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. ఏజెన్సీ ముఖద్వారంగా పేర్కొంటున్న ప్రధాన రహదారికి మోక్ష మోప్పుడంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. అడుగడుగున గోతుల మయంగా తయారైన రహదారిపై


గోతుల మయంగా ఉన్న బుట్టాయగూడెం రహదారి

ప్రయాణం ప్రమాదాలు తెచ్చిపె డుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై పడిన గోతుల కారణంగా ప్రమాదాలు జరుగుతు న్నాయని, వాహనాలు తరచూ షెడ్డుకు వెళ్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు. 10 నుంచి 15 నిమిషాల్లో ప్రయాణించే దూరాన్ని 40 నిమిషాలు పడుతోందని తెలియజేస్తున్నారు.ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు ఇతర కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, జంగారెడ్డిగూడెం పట్టణ ప్రాంతాలకు వెళ్లే ఏజెన్సీ వాసులు నిత్యం నరకాన్ని చూస్తున్నారు.

వర్షాలతో పనులకు అడ్డంకి..

బుట్టాయగూడెం - జంగారెడ్డిగూడెం ప్రాంతాల మధ్య సుమారు 10 కిలోమీటర్ల మేర పంచాయతీ రాజ్ శాఖ బీటీ రోడ్డు ఉంది. ఈ రోడ్డు పూర్తిగా పాడైపోయి గోతులమయంగా మారడంతో ఏజెన్సీవాసులు నరకయాతన పడుతున్నారు.గతంలో కొన్నిచోట్ల మరమ్మతులు చేసినా సమస్య పూర్తిగా తీరలేదు. రహదారిపై కొన్ని చోట్ల పెద్ద గోతులు పడి కాలినడకన వెళ్లడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. రోడ్డును బాగుచేసి పుణ్యం కట్టుకోవాలని వాహనదారులు, ఏజెన్సీ వాసులు ప్రభుత్వానికి, అధికారులకు మొరపెట్టుకోని రోజంటూ లేదు. ప్రభుత్వం మారడంతో ఏజెన్సీవాసులకు మంచిరోజులు వచ్చినట్లు అయ్యింది. పాడైపోయిన రోడ్డును బాగుచేయడానికి ఉపాధి నుంచి రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తవడంతో నెల రోజుల క్రితం అధికారులు రోడ్డును పూర్తిగా తవ్వేసి నూతనంగా రోడ్డును వేసే పనులు ప్రారంభించారు. దీంతో వాహనదారులు, జనాలు రోడ్డు పనులు జరుగుతున్నాయని ఎంతగానో సంబరపడ్డారు. ఆ ఆనందనం ఎన్నో రోజులు నిలవలేదు. మరో 10 రోజుల్లో రోడ్డు పూర్తవుతుందని ఆనందించిన ప్రజలకు నిరాశే మిగిలింది. పనులు జరుగుతున్న సమయంలో వర్షాలు కురవడంతో రోడ్డు అధ్వానంగా మారి జనాలకు విసుగొస్తోంది.వర్షాలకు రోడ్డుపై వేసిన రజను కొట్టుకుపోయి గోతులు ఏర్పడి నల్లమెటల్ దర్శనమిస్తుంది. గోతుల్లో మరలా రజను పోసినా కురుస్తున్న వర్షాలకు అది కూడా కొట్టుకుపోయి గోతులు దర్శనమిస్తున్నాయి. పనులు పూర్తికాకపోవడంతో రోడ్డు సమస్య మొదటికొచ్చింది. వరుణుడు కరుణిస్తే తప్పా రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా కానరావడం లేదు. అప్పటి వరకు జనాలకు తిప్పలు తప్పవు అన్నట్టు ఉంది. పాలకులకు రోడ్డు దుస్థితి తలనొప్పిగా మారింది.



గుంతలు పూడ్చిన టీడీపీ నాయకులు

కుక్కునూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీరవల్లి పంచాయతీ పరిధిలో మసీదు సెంటర్‌లో పెద్దగుంతలు పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. దీంతో చీరవల్లి టీడీపీ నాయకులు గుంతలు తవ్వి గ్రావెల్ నింపి రహదారిని ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు గంజి రాంబాబు, సర్పంచ్ పిట్టా శివ పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న దృశ్యం

భక్తుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణం

ఏలూరుటూటౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): భక్తుల అవసరాల నిమిత్తం కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడుతున్నామని నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్ పెదబాబు అన్నారు. ఆదివారపు పేటలో శ్రీప్రేమసాయి మందిర్ వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి మీనా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా షిర్డీసాయి ప్రేమమందిరం కమిటీ ఛైర్మన్ ఇసుకపల్లి తాతారావు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు. కార్పొరేటర్ ఇలియాజ్‌బాషు, మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకుడు

మద్ది క్షేత్రంలో హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో ఆదివారం శ్రీహనుమద్ హోమం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో ప్రతీ ఆదివారం హనుమద్ హోమం ఆర్జిత సేవగా నిర్ణయించినట్టు ఈవో ఆర్‌వి.చందన తెలిపారు.


వృద్ధులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వృద్ధులకు ఉచితంగా నేత్ర పరీక్షలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులకు ఆదివారం స్థానిక ప్రశాంతి వాకర్స్ అసోసియేషన్ భవనంలో విజయవాడకు చెందిన మాక్సీ విజన్ సూపర్‌స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్రవైద్య శిబిరం జరిగింది. వైద్య పరీక్షల ద్వారా గుర్తించిన 40మందికి శస్త్రచికిత్సలు అవసరమవుతాయని నిర్ధారణకువచ్చి వారిని ఆపరేషన్ల నిమిత్తం ఆసుపత్రి వాహనంలో తరలించారు. వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దున్నా వెంకటేశ్వరరావు,కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి రామ్మోహనరావు, గౌరవాధ్యక్షుడు రామారావు, సభ్యులు రవీంద్ర, ఆంజనేయులు, మురళీకృష్ణ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో 135 మందికి పరీక్షలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో అగ్రహారంలోని దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో వేమగిరికి చెందిన పరమ హంస యోగానంద వైద్యశాల సిబ్బంది 135 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలిచ్చారు. 36 మందికి రాయితీపై కళ్లజోళ్లు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ ప్రతి నెలా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న కమిటీని అభినందించారు. బొలిశెట్టి సురేష్ కుమార్, టి.అజయ్, పి.పండరీనాథ్ సేవలందించారు.



స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్

ఏలూరు క్రైం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఏలూరు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మానవత సంస్థ సభ్యులు, ఎన్‌సీసీ విద్యార్థులు, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది ఆదివారం ఏలూరు సర్వజన ఆస్పత్రి ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిచ్చిమొక్కలను, వ్యర్థాలను, ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. రక్తదానం ఆవశ్యకతపై ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

ఘనంగా గంగానమ్మ జాతర

పెదపాడు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురంలో గంగానమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని గంగానమ్మకు పెద్దసంఖ్యలో భక్తులు మొక్కులు తీర్చుకుని పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి కావడిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. దారి పొడవునా మహిళలు పసుపు, కుంకుమ వేపాకులతో కూడిన నీళ్లబిం దెలను అమ్మవారికి పోశారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శనివారపుపేట పడమర వీధిలో..

ఏలూరు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): చల్లని తల్లి గంగానమ్మ చల్లగా చూడు అంటూ భక్తులు గంగానమ్మను భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. శనివారపుపేట పడమర వీధి గంగానమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయానికి కోరిన కోర్కెలు తీర్చే దేవతగా ప్రసిద్ధి చెందింది. జాతర సందర్భంగా ఉదయం విశేష పూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరాలు చేశారు. అమ్మవారిని కనులారా చూసి తన్మయత్వం చెందారు.శనివారపుపేట సొసైటీ డైరెక్టర్ సోమిశెట్టి రామ్మోహనరావు, బెల్లాని వెంకన్న, వాసా అన్నవరం కత్తుల శ్రీనివాస్, చిత్తూరు ప్రసాద్, వెదురుపాక ప్రసాద్, పూర్ణచంద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పెనుమాకలంకలో గంగానమ్మ జాతర

దెందులూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):కొల్లేరులోని పెనుమాకలంక గ్రామంలో ఆదివారం జరిగిన గంగనమ్మ జాతరలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు.ప్రజలందరిపై గంగనమ్మ తల్లి ఆశీస్సులు ఉంటాయని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి చింతమనేనికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతమనేని వెంట కొల్లేరు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.మోటార్ సైకిల్‌పై చింతమనేని గ్రామంలో పర్యటించారు.

సూర్యదేవుడికి అభిషేకాలు, అర్చనలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద శ్రావణమాసంలోని ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని సామూహికంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాళ్లబండి ఆదినారాయణ శర్మ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు. ఆలయ ఛైర్మన్ కోరాడ రెడ్డి, బూరాడ పూర్ణచంద్రరావు బృందం భక్తులకు తగు సేవలందించారు.

అంగన్వాడీ నూతన కమిటీ ఏర్పాటు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్షురాలిగా పి.భారతి, కార్యదర్శిగా టి.మాణిక్యం ఎంపికయ్యారు. శనివారం రోటరీ కమ్యూనిటీ హాల్లో 9వ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సందర్భగా నూతన కమిటీను ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా డీఎన్వీడీ ప్రసాద్, కోశాధికారిగా ఎం.తులసి, ఉపాధ్యక్షులుగా పి.సుజాత, టి.రజిని, పి.రాజకుమారి, బి.జె.ఎస్.కుమారి, జి.విమల, వి.స్వర్ణకుమారి, భార్గవి, చల్లమ్మ, సహాయ కార్యదర్శులుగా కె.పుష్ప, ఎస్.లత, జి.సరళ, షమీమా, ఇందిర, మహిమ, వెన్నెల ఎన్నికయ్యారు.


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న నవ్య, తదితరులు

వైభవంగా శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ

దెందులూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పోతునూరులో నూతనంగా నిర్మించిన గౌరీదేవి ఆలయంలో శివ పార్వతుల విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. ముడ్రోజులుగా సంప్రదాయబద్ధంగా శాంతి హోమం నిర్వహించి గౌరీ దేవి ఆలయంలో శివపార్వతుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్య విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ గ్రామాధ్యక్షుడు నున్న లక్ష్మణ్, సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు బోడేటి మోహన్‌బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దెందులూరు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా కలపాల శ్రీహరి



దెందులూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ముఖ్యకేంద్రం దెందులూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కలపాల శ్రీహరిని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రకటించారు. దెందులూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన కలపాల శ్రీహరిని, సభ్యులుగా అవర్శుల పద్మా, మరీదు మాణిక్యం ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు కలపాల శ్రీహరికి బొకే ను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణం

ఉంగుటూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):నాచుగుంట గోపాలకృష్ణ గోశాలలో ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి కల్యాణం సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవ, గోశాల కమిటీ సభ్యులు పరిమి రాఘవులు, కొరపల్లి వెంకట అప్పారావులు తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు స్వామి వారి రథానికి స్వాగతం పలుకుతారన్నారు. అప్పటి నుంచి స్వామి వారి కల్యాణం ప్రారంభమవుతుందని అన్నారు.

పాస్టర్ ప్రకాశ్ మృతికి సంతాపం

టి.నర్సాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రముఖ దైవజనులు ప్రొఫెసర్ ప్రకాశ్ గంటేల అకాల మృతి క్రైస్తవ సమాజానికి తీరనిలోటని పోలవరం నియోజకవర్గ పాస్టర్ల జాయింట్ ఎక్షన్ కమిటీ కార్యదర్శి కురసం నిరీక్షణరావు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రకాశ్ గంటేల సంతాప సభ మండల పాస్టర్ల జేఏసీ సెక్రటరీ బీకిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం గుర్వాయిగూడెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిరీక్షణరావు మాట్లాడుతూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మండల పాస్టర్ల జేఏసీ జి.జ్ఞానరాజు, డి.అకుల, ప్రసన్నరాజు, రమేశ్, కె.జాన్, దానియేలు పాల్గొన్నారు.

లయన్స్ ఉచిత సేవలు

చింతలపూడి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని యర్రగుంటపల్లిలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ సీజనల్ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత క్యాంపు నిర్వహించామన్నారు. సన్‌లైఫ్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చైతన్య, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ దినేష్‌గుప్త వైద్య పరీక్షలు నిర్వహించారు. కొద్దిసేపు అవగాహన కార్యక్రమం నిర్వహించి జాగ్రత్తలు తెలియపరిచారు. లయన్స్ సభ్యులు చిల్లపల్లి మోహన్‌రావు, సి.హెచ్.అబ్బయ్య, గాంధీ, సుధాకర్, రాజగోపాల్ పాల్గొన్నారు.


వైద్య శిబిరం ప్రారంభిస్తున్న లండన్ బృందం

155 మందికి వైద్య పరీక్షలు

కామవరపుకోట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కామవరపుకోట మండలం కళ్ల చెరువు పంచాయతీలోని గండిగూడెంలో 155 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. పెదవేగి ఎస్‌ఎంసీ ఆసుపత్రికి చెందిన వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలిచ్చారు. మానవత శాఖ అధ్యక్షులు పావులూరి చంద్రలాల్ గాంధీ, గ్రామ నాయకులు నౌడు సత్యనారాయణ, ఎస్ఎంసి ఆస్పత్రి నుంచి వచ్చిన లండన్‌కు చెందిన వైద్య బృందం సేవలందించింది.

వైసీపీ నాయకులకు పదవులు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా మండలంలోని మైసన్నగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కుక్కల ధర్మరాజును, మండలంలోని టెక్కినవారిగూడెం గ్రామానికి చెందిన మల్నీడి మోహన కృష్ణ(బాబీ)ను రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శిగా ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈసందర్భంగా ఆదివారం మచిలీపట్నం వైసీపీ పరిశీలకుడు నాయకుడు జెట్టి గురునాథరావు, వద్ద వైసీపీ శ్రేణులు కుక్కల ధర్మరాజును, మల్నీడి బాబీని అభినందించారు. జెట్టి గురునాథరావు కార్యాలయం వద్ద కుక్కల ధర్మరాజును ఘనంగా సత్కరించారు. పార్టీ మండలాధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర, పట్టణ అధ్యక్షుడు కర్పూరం గుప్తా, జెట్టి ఆదిత్య, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ముప్పిడి శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి అంజి, పి.వెంకన్న, బత్తిన చిన్నా పాల్గొన్నారు.

మలబార్‌లో సరికొత్త కలెక్షన్స్ వ్యాన రత్నాభరణాలు


ఆభరణాలు ప్రదర్శిస్తున్న యువతులు

ఏలూరు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ మహిళ తన ప్రత్యేకతను చాటుకునేలా సరికొత్త రత్నాభరణాల సేకరణ అయిన 'వ్యాన'ను ప్రముఖ ఆభరణాల రిటైలర్లలో ఒకటైన మలబార్‌గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ ఆవిష్కరించింది. ఏలూరు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో 'వ్యాన'ను వినియోగదారులు మలబార్ సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ డైరెక్టర్ జైనుద్దీన్ మాట్లాడుతూ ప్రతీ మహిళ తన ప్రత్యేకత చాటుకునేలా బలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సరికొత్త కలెక్షన్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. మారుతున్న ఆధునిక భారతీయ మహిళలకు ఇవి సరైన ఆభరణాలుగా నిలుస్తాయన్నారు. ఎలాంటి శుభకార్యమైనా ఎంతో బాగుంటాయని అన్నారు. వజ్రంతో ప్రేరేపితమైన తేజస్సును, వర్ణరంజితమైన శక్తివంతమైన రత్నాలు సులభంగా ఒదిగిపోయేలా మారుతున్న కాలానికి అను గుణంగా 22 క్యారట్ల బంగారంతో ఎంతో శ్రద్ధగా 'వ్యాన'ను సుందరంగా రూపొందించినట్టు తెలిపారు. ట్రెండీగా, బోల్డ్, సులభంగా ధరించగలిగే ఆభరణాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయన్నారు. 28 పాయింట్లు నాణ్యత తనిఖీకి లోబడిన వజ్రాలు ధృవీకరణతో లభిస్తాయని, ప్రతీ కొనుగోలుకు ఏడాది పాటు ఉచిత బీమాను అందిస్తున్నామని తెలిపారు. రత్నాలు, అన్కట్ వజ్రాల ఆభరణాల తరుగు చార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు పొందవచ్చన్నారు. ఈ ప్రత్యేక ఆఫర్ సెప్టెంబర్ 7వ తేదీ వరకు వర్తిస్తుందన్నారు. షోరూమ్ మేనేజర్ ప్రేమ్ కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగాన్ని ప్రభుత్వం కాపాడాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగాన్ని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సీపీఎం కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షత వహించి మాట్లాడారు. సీపీఐ ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావులు మాట్లాడుతూ అమెరికా పన్నుల కారణంగా ఆక్వా పరిశ్రమ ఒక్కసారిగా కుదేలైందన్నారు. దేశవ్యాప్తంగా పది లక్షల మంది ఆక్వా సాగు చేస్తున్న రైతులు ఉంటే ఆంధ్రాలోనే నాలుగు లక్షల మంది ఉన్నారన్నారు. వేల కోట్లు విదేశీ మార్కద్రవ్యం రూపంలో దేశానికి వందల కోట్ల పన్నులు మార్కెట్ సెస్సుల రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తుందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్, టీకేఎంయూ జిల్లా అధ్యక్షులు బండి


రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి. ప్రసాద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.రామకృష్ణ, గుడిపాటి నరసింహారావు, ఎం.ఇస్సాకు, డి.చంద్రశేఖర్, పి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతికి ఏర్పాట్లు

ముదినేపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, గోల్కొండను పాలించిన సర్ధార్ సర్వాయిపాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలను ముదినేపల్లిలో సోమవారం నిర్వహించేందుకు మండల గౌడ సంఘం ఏర్పాట్లు చేస్తున్నది. స్థానిక గురజ రోడ్డు సెంటర్‌లోని పాపన్న విగ్రహాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘ నాయకులు, సంఘీయులు పాల్గొనాలని ముదినేపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు పరసా కనకారావు, పాపన్నగౌడ్ విగ్రహ దాత బొర్రా శేషుబాబు కోరారు.

బయోమెట్రిక్ విధానంలోనే ఎరువులు విక్రయించాలి

ఆగిరిపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆగిరిపల్లి, నెక్కలం గొల్లగూడెం, కొత్త ఈదర గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఆదివారం మండల వ్యవసాయాధికారిణి జె. భవాని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లంతా ఈ పోస్ మిషన్ ద్వారా బయోమెట్రిక్ విధానంలోనే విక్రయించాలని తెలిపారు. డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు


ఉప్పుటేరులో ఎక్స్‌కవేటర్లతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

కైకలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కొల్లేరుకు వరద ఉధృతి రోజురోజుకు పెరగడంతో ఉప్పుటేరు ఆక్రమణలను యంత్రాల సహాయంతో తొలగింపు చర్యలు ఆదివారం రెండోరోజు నిర్వహించారు. రెండు ఎక్స్‌కవేటర్లను ఏర్పాటుచేసి సరస్సులోని కిక్కిసను గట్టుపైకి చేరవేస్తున్నారు. మరోవైపు గట్టుపై ఉన్న ఆక్రమణలను తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం సిబ్బందితో తొలగింపు చర్యలను నిర్వహించారు. ఎగువ నుంచి వరద నీరు రావడంతో సర్కారు కాలువ నుంచి ఉప్పుటేరులోకి వరద నీరు చేరుతోంది. మరింత వేగవంతంగా ఈ పనులను నిర్వహించి నీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న కిక్కిస కర్రను పూర్తిస్థాయిలో తొలగిస్తున్నారు. ఎగువన కొట్టాడ ప్రాంతంలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు సోమవారం నుంచి పనులు చేపట్టనున్నారు. కైకలూరు ప్రాంతంలోని ఉప్పుటేరు పరివాహక ప్రాంతం నీటి ప్రవాహానికున్న అవరోధాల్ని తొలగిస్తారు.


ప్రిన్సిపాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న పూర్వ విద్యార్థినులు

పూర్వ విద్యార్థినులే వైద్యులు..

పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించి ఫ్రిజ్ బహూకరణ

మునునూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో చదువుకుని వైద్య వృత్తిలో స్థిరపడిన పూర్వ విద్యార్థినుల సేవలు అభినందనీయమని ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి అన్నారు. ఆదివారం పూర్వ విద్యార్థినులైన ఆరుగురు వైద్యవృత్తిని చేపట్టడంతో మునునూరు గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డాక్టర్ శారద, కవిత, దంత వైద్య నిపుణులు డాక్టర్ భాగ్యలక్ష్మి, సుధ, సర్జన్ డాక్టర్ శాంతి వర్ధని, ధనలక్ష్మీ పాఠశాలలో 480 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం బాలికలకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా వైద్యులను సంప్రదించాలని సూచించారు. పాఠశాలలో మందులను నిల్వ చేసుకునేందుకు ఫ్రిజ్, ఆట వస్తువులను వారు బహూకరించారు. వైద్య బృందాన్ని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. తొలుత భారీ ర్యాలీ నిర్వహించి, బాణాసంచా కాల్చి, అన్నసమారాధన నిర్వహించారు.



సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నూజివీడు టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 20 నుంచి 25 వరకు జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం నూజివీడులో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ మహాసభల్లో ఎంపికయ్యే రాష్ట్ర సీపీఐ నూతన నాయకత్వం మహాసభ వేదికగా రాష్ట్ర భవిష్యత్‌కు మార్గదర్శకత్వం చేసేలా పలు తీర్మానాలను ఆమోదించనుందని అన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకుడు గుంట సుబ్బారావు పాల్గొన్నారు.



కార్మిక హక్కుల కోసం పోరాడిన 'కొరారి'

నూజివీడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించిన కార్మిక నాయకుడు కొరారి నరసింహారావు ఆదర్శనీయుడని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు పేర్కొన్నారు. కొరారి 26వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నూజివీడులోని కార్మిక భవన్ వద్ద ఆయన విగ్రహానికి చలసాని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యాల కబంధ హస్తాల్లో చిక్కుకుని వెట్టి చాకిరీ చేస్తున్న కార్మికులను సంఘటితపరిచి యూనియన్లను స్థాపించి కార్మిక హక్కుల కోసం శ్రమించిన పోరాట యోధుడు కొరారి నరసింహారావు అన్నారు. రాష్ట్రస్థాయిలో ఆర్టీసీ పోర్టర్స్ యూనియన్, సివిల్ సప్లై యూనియన్ స్థాపన కొరారు చొరవతోనే జరిగాయన్నారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, నూజివీడు ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రమణక్కపేట త్రిసభ్య కమిటీని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

'రైతులకు ఉత్తమ సేవలు అందించాలి'

మునునూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఉత్తమ సేవలను అందించడంతోపాటు సొసైటీ అభివృద్ధికి త్రిసభ్య కమిటీ కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు అన్నారు. ఆదివారం రమణక్కపేట కో-ఆపరేటివ్ సొసైటీ నూతన త్రిసభ్య కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షులుగా రంగు ఆంజనేయులు, సభ్యులుగా పాశం వెంకటేశ్వరరావు, ముళ్ళపూడి మల్లీశ్వరితో కార్యదర్శి ఆకుల ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీని మండల అధ్యక్షుడు రఘుబాబు, నియోజకవర్గ టీడీపీ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు, మండల మాజీ అధ్యక్షుడు దేవినేని ఢలరాం, మాజీ జడ్పీటీసీ చిలుకూరి వెంకటేశ్వరరావు, కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడిశెట్టి గిరిబాబు, గ్రామ అధ్యక్షుడు రంగు శ్రీనివాసరావు, నాయకులు కందుల పిచ్చియ్య. తోట ప్రభాకర్‌రావు, జనసేన నాయకుడు పాశం నాగబాబు సన్మానించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

బురద నీరే.. తాగునీరు!

- పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువు
- ఫిల్టర్ చేయకుండానే సరఫరా.. వాడకానికీ పనికిరావు!
- జనాభాకనుగుణంగా పెరగని చెరువు విస్తీర్ణం.. తప్పని పాట్లు


పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువు

కలిదిండి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదలంక గ్రామంలోని తాగునీటి చెరువు అడుగంటింది. దీంతో రెండు రోజులకొకసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నీటిని ఫిల్టర్ చేయకపోవడంతో బురద నీటినే కుళాయిల ద్వారా సరఫరా చేస్తుండటంతో ఈ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. దీనికి తోడు కొంగలు వాలి నీటిని కలుషితం చేస్తుండటంతో దుర్వాసన వస్తున్నాయన్నారు. తాగటానికి ఆమోదయోగ్యంగా లేకపోవటంతో ప్రైవేట్ ఆర్వో ప్లాంట్ల నుంచి బిందె నీరు రూ.10 చొప్పున కొనుగోలు చేస్తుండగా, పేదలు, వృద్ధులు ఆ బురద నీరే తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు. పెదలంకలో సుమారు 5 వేల మంది జనాభా ఉన్నారు. మంచినీటి చెరువు విస్తీర్ణం ఎనిమిది ఎకరాలే కావటంతో రెండు నెలల్లో చెరువు ఎండిపోతుంది. మంచినీటి చెరువు విస్తరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు పలు మార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. తాగునీటి చెరువును పూర్తిస్థాయిలో నింపి రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నా రెండు నెలల్లో చెరువు అడుగంటుతోందని వాపోతున్నారు. చెరువులో నీరు తగ్గి సుమారు నెల రోజులు గడుస్తున్నప్పటికీ తాగునీటి వంతు ఇరిగేషన్ అధికారులు ఇవ్వకపోవటంతో పలు అవస్థలు పడుతున్నామని, ఇదే పరిస్థితి కొనసాగితే వాడకపు నీటిని కూడా ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లలో కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల్లో చెరువు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని, ఉన్నతాధికారులు స్పందించి అడుగంటిన పెదలంక చెరువును నింపాలని ప్రజలు కోరుతున్నారు.

సర్పంచ్ ఏమన్నారు?

ఈ విషయమై సర్పంచ్ మోకా లక్ష్మిని వివరణ కోరగా, చెరువును నింపటానికి తాగునీటి వంతు ఇవ్వాలని, 20 రోజుల క్రితమే ఇరిగేషన్ అధికారులకు విన్నవించాం. నాలుగు రోజుల్లో ఇస్తామని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. వంతు ఇచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన మోటారుతో చెరువు నింపుతాం.

ఇరిగేషన్ ఏఈఈ వివరణ

ఈ విషయమై ఇరిగేషన్ ఏఈఈ ఫణి కుమార్‌ను వివరణ కోరగా, ఈ నెల 20 నుంచి లంక గ్రామాలకు తాగునీటి వంతు ఇస్తామని, ముందుగా పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువు నింపి ఆ తర్వాత మూల్లంక, భాస్కరరావుపేట, తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుతామన్నారు.

ప్రజలకు మంచి చేసే కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

- నామినేటెడ్ పదవులు రాని వారికి రెండేళ్లలో అవకాశం
- రూ. 83.25 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన మంత్రి పార్థసారథి


వృద్ధురాలి నుంచి అర్జీని స్వీకరిస్తున్న మంత్రి

మునునూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మంచి చేసే కూటమి ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. మునునూరు మండల కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలో సీఎం సహాయ నిధి ద్వారా రూ. 83.25 లక్షల విలువైన చెక్కులను 135 మంది లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ పేద వర్గాలకు వైద్యఖర్చులు అందించాలని సీఎం సహాయనిధిని పునరుద్ధరించి ఎక్కువ మందికి ఆర్థికసాయాన్ని అందించడం నిరుపేదల పట్ల సీఎంకు ఎంత అభిమానమో అర్థం అవుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పక్కదోవ పట్టించి పేదలకు వైద్యాన్ని పూర్తిగా దూరం చేసిందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 500 మందికి సీఎం సహాయనిధి ద్వారా సుమారు రూ. 6 కోట్లు వరకు సాయం అందించామన్నారు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ మంచిని పది మందికి చెప్పాలని కోరారు. శ్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ. 2 వేల కోట్లు కేటాయించి 1 కోటి 40 లక్షల మంది మహిళలకు విద్య, ఉపాధి, బంధువులను కలుసుకునే అవకాశం కల్పించామన్నారు. ఈ పథకం ద్వారా తొలిరోజున 8.50 లక్షల మంది మహిళలు ప్రయాణం చేసి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారన్నారు. ఈ ప్రభుత్వ సుపరిపాలనపై గత ప్రభుత్వ నేతలు బురద జల్లుతుండటం బాధాకరం అన్నారు. నియోజకవర్గంలో మిగిలి ఉన్న పనులను దశల వారీగా పూర్తి చేస్తామన్నారు. నామినేటెడ్ పదవులు దక్కనివారు బాధపడవద్దని రెండేళ్ల తరువాత కొత్తవారికి అవకాశం కల్పిస్తామన్నారు. సొసైటీలు, నీటి సంఘం అధ్యక్షులు, ఇతర పదవుల్లో ఉన్నవారు తమ పదవులకు తగిన న్యాయం చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఐక్యతగా రానున్న అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మంత్రి కోరారు. నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, తహసీల్దార్ దాసరి ప్రశాంతి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో సుబ్బారావు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి పెన్షన్ మంజూరు చేయండి

పెన్షన్‌ను మంజూరు చేయాలని గోగులంపాడుకు చెందిన వృద్ధురాలు కొప్పుల వరలక్ష్మి మంత్రి పార్థసారథిని కోరింది. ఆదివారం మునునూరులో జరిగిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీకి వచ్చిన మంత్రి దృష్టికి ఆమె సమస్యను తీసుకువెళ్ళింది. తన భర్తకు పెన్షన్ వచ్చేదని, రెండేళ్ళ క్రితం అనారోగ్యంతో చనిపోయాడని, నాటి నుంచి కనీసం మందులకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాని మంత్రికి వృద్ధురాలు వివరించింది. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే వృద్ధురాలికి స్పౌజ్ పెన్షన్ మంజూరు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు.

తీరు మారింది!

(5వ పేజీ తరువాయి)

జిల్లాస్థాయిలో కొందరు అధికారుల తీరు నామమాత్రంగా మారడంతో నిర్ణయాలేవి ఫలవంతం కావడం లేదు. గత సమావేశంలో డ్రాప వుట్లను తగ్గించి, అడ్మిషన్ల పెంచాలని భావించినా ఆ మేరకు లక్ష్యాలను అందుకోలేకపోయారు. సాగునీటి కాల్వల నిర్వహణలోనే ఇదే సాగింది. ప్రస్తుత ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న నాదెండ్ల మనోహర్ సాధ్య మైనంత మేర జిల్లాలో ప్రధాన సమస్యలపై గత సమావేశంలోను అధికారులకు తగు మార్గనిర్దేశం చేసినా, కొన్ని అంశాల్లో ఇంకా జాప్యమే. సోమవారం మరోమారు జిల్లా సమీక్షా కమిటి సమావేశం జరగబోతుంది. ఇప్పటికే ఉపాధిహామీ కింద కూలీలకు ఇవ్వాల్సిన వేతన బకాయిలు కొనసాగుతున్నాయి. కొల్లేరు సమస్య, ఉప్పటేరు సమస్య తొంగి చూస్తున్నాయి. ఈ సారి వ్యవసాయం, అనుబంధంగా ఉద్యానవన, ఉపాధి వంటి అంశాలపై చర్చించబోతున్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలుపైనే ఇన్‌చార్జి మంత్రిగా ఆయన దృష్టిపెట్టి వివరాలు రాబడితే సమావేశ లక్ష్యాలు ఎంత మేర తీరుతున్నాయనేది బహిర్గతం కావడం ఖాయం.


వధూవరులతో ఐటీ మంత్రి లోకేశ్, మంత్రి నిమ్మల తదితరులు

వైభవంగా మంత్రి నిమ్మల కుమార్తె నిశ్చితార్థం

పాలకొల్లు/పాలకొల్లు అర్బన్/పాలకొల్లు టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఇంట పెండ్లి సందడి మొదలైంది. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని కల్యాణ మండపంలో మంత్రి నిమ్మల రామానాయుడు, సూర్యకు మారి దంపతుల కుమార్తె శ్రీజ నిశ్చయ తాంబూలాల వేడుక వైభవంగా జరిగింది. వీరవాసరం మండలం తోలేరు గ్రామానికి చెందిన యిర్రింకి వెంకట సూర్యనారాయణ, కరుణమణి దంపతుల కుమారుడు పవన్‌కు వివాహ నిశ్చ య తాంబూలాలను బంధు,మిత్రుల మధ్య స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను గజమాల, పూల బొకేలతో ఘన స్వాగతం పలికి మహిళలు పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా శ్రీజ, పవన్‌లకు లోకేశ్ అక్షింతలు వేసి ఆశీర్వదించారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

పార్టీ చొక్కాతోనే డాక్టర్ నిమ్మల

ప్రజా జీవితంలో రాజకీయ నాయకులకు కొన్ని సిద్ధాంతాలు, నిబద్ధత ఉంటాయి. ఆ నిబద్ధతను జీవితంలో ప్రతీ సందర్భంలోనూ పాటించడం చాలా అరుదుగా చూస్తుంటాం. అటువంటి వ్యక్తిత్వం మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుది. టీడీపీ నాయకుడిగా, రాష్ట్ర మంత్రిగా నిత్యం పార్టీ రంగు అయిన పసుపు చొక్కానే ధరించి కనిపిస్తారు. తాజాగా తన కుమార్తె వివాహ నిశ్చితార్థంలోనూ ఆదే పసుపు చొక్కాతో కనిపించడం ఆయన నిబద్ధతకు, పార్టీ పట్ల ఆయనకున్న విశ్వాసానికి నిదర్శనం.


చింతలవల్లి సొసైటీలో ఎరువులను తనిఖీ చేస్తున్న ఏడీ విద్యాసాగర్

యూరియా పంపిణీలో వరి, పత్తి రైతులకు ప్రాధాన్యమివ్వండి

మునునూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎరువుల విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నూజివీడు డివిజన్ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ అన్నారు. ఆదివారం చింతలవల్లి, చెక్కపల్లి, రమణక్కపేట సొసైటీల్లో ఎరువుల గోదాములతో పాటు ప్రైవేట్ దుకాణాలను సైతం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల విక్రయాలు, స్టాక్ రికార్డులను ఆయన పరిశీలించారు. యూరియా, ఇతర రసాయన ఎరువుల సరఫరా, నియంత్రణపై ఆరా తీశారు. ముఖ్యంగా వరి, పత్తి రైతులకు మొదటి ప్రాముఖ్యత ఇచ్చి, ఆధార్ కార్డుకు అనుసంధానం అయిన ఈ పాస్ ద్వారా యూరియాను విక్రయించాలని సొసైటీ కార్యదర్శులు, దుకాణాల యాజమానులకు ఏడీ సూచించారు. యూరియాతో పాటు ఇతర ఎరవులను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏవో చాముండేశ్వరి పాల్గొన్నారు.

వరద భయం

(5వ పేజీ తరువాయి)

హెచ్చరికలు జారీ చేయాలన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదివారం పెద ఎడ్లగాడి నుంచి బోటులో పెనుమాకలంక గ్రామానికి చేరుకుని వరద పరిస్థితిని పరిశీలించారు. తహసీల్దార్ గోపాల్ అధికారులతో కలిసి పెద్దఎడ్లగాడి రోడ్డు మార్గాన్ని పరిశీలించి వాహనదారులు ఈ మార్గంలో వెళ్లవద్దని హెచ్చరించారు. పోల్‌రాజ్ డ్రైన్ ఉధృతంగా ప్రవహించడంతో కొల్లేరులోనికి భారీగా వరదనీరు చేరుతుంది. సర్కారుకాలువ వద్ద ఉధృతంగా ప్రవహిస్తుండడమే గాక రెండు అంగుళాల మేర నీటి మట్టం పెరిగింది. ఎగువ నుంచి నీరు భారీగా చేరడంతో మరో రెండు, మూడురోజుల్లో కొల్లేరు సరస్సులోనికి వేల క్యూసెక్కుల నీరు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

పొంగిన పోల్‌రాజ్ డ్రెయిన్లు

కొల్లేరు సరస్సుకు వరద తాకిడితో పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్ గట్ల అంచులను తాకుతూ ప్రవహిస్తోంది. వర్షాల తో నీటి మట్టం మరింత పెరిగే అవకాశాలున్నాయి. కొమరవోలు డ్రెయిన్ నుంచి కూడా నీరు భారీగా పోల్‌రాజ్ డ్రెయిన్‌లో చేరుతోంది. పలుచోట్ల పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు తొలగించినా ఇసుక మేటలతో నీటి ప్రవాహా నికి ఆటంకాలు ఏర్పడ్డాయి. పలు మైనర్ డ్రెయిన్లలో నీటి ప్రవాహం స్తంభించింది. వందలాది ఎకరాల ఆయకట్టు ముంపు బారిన పడనుంది. ముదినేపల్లిలో మైనర్ డ్రెయిన్ పూడికతో పొలాల్లో ముంపు నీరు బయటకుపోవడం లేదు.

రాకపోకలు బంద్

ఎగువన వర్షపు నీటితో కొల్లేరులోకి భారీగా వరద నీరు ప్రవహించడంతో ఏలూరు రూరల్ మండలంలోని కొమటి లంక రహదారి కొట్టుకుపోయింది. రాకపోకలు నిలిచిపోవ డంతో అత్యవసర పనులకు గ్రామస్తులు పడవలో వెళుతు న్నారు. వాగు పొంగి ప్రవహించడంతో వైద్యం కోసం గర్భిణులు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మహిళా ప్రయాణికులే అధికం


ముదినేపల్లిలో బస్సెక్కేందుకు మహిళలు పోటీ

ముదినేపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణానికి గ్రామీణ ప్రాంతాల్లో విశేష స్పందన లభిస్తున్నది. ముదినేపల్లి నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రతి బస్సులోను మహిళా ప్రయాణీకులే కనిపిస్తున్నారు. ఆదివారం ముదినేపల్లిలో గుడివాడ, బంటుమిల్లి, కైకలూరు వెళ్లే ఆర్టీసీ బస్సులు, భీమవరం-విజ యవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో 70 శాతం పైగా మహిళా ప్రయాణీకులే కనిపించారు. గుడివాడ - ముదినేపల్లి షటిల్ బస్ సర్వీసుల్లో 90 శాతం మహిళ లు ప్రయాణించారు. బస్సులు ఎక్కేందుకు కూడా మహిళలు పోటీ పడ్డారు. శుభకార్యాలు కూడా ఉండ టంతో ఆర్టీసీ బస్సులు మహిళలతో కిక్కిరిసిపోయాయి. ఫ్రీ బస్సుల్లో ప్రయాణం కొత్త అనుభూతిని కలిగిస్తున్నదని పలువురు మహిళలు చెబుతున్నారు.

భారీ చేప చిక్కిందోచ్


తమ్మిలేరు ప్రాజెక్టులో చిక్కిన భారీ చేప

చాట్రాయి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తమ్మిలేరు ప్రాజెక్టులోకి ఆదివారం చేపల వేటకు వెళ్ళిన పోతనపల్లి మత్స్యకారులకు భారీ చేప చిక్కింది. వాలగ జాతికి చెందిన ఈ చేప బరువు సుమారు 20 కేజీలు ఉన్నదని, ఇటువంటి చేపలు అరుదుగా దొరుకుతుంటాయని, ఇది రూ. 4 వేలకు అమ్ముడుపోయినట్లు మత్స్యకారులు చెప్పారు. తమ్మిలేరు ప్రాజెక్టుకు వరద వస్తున్నందున జలాశయంలోను, ఏటిఒడ్డు గ్రామాల్లో జోరుగా చేపల వేట సాగుతోంది.

ఉట్టి కొట్టిన వారికి బహుమతులు


బహుమతులు అందిస్తున్న కోటేశ్వరరావు

చాట్రాయి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరుగొలనుపేటలో కృష్ణాష్టమి సందర్భంగా శనివారం రాత్రి నిర్వహించిన ఉట్టికొట్టే పోటీలలో విజేతలైన ముగ్గురు యువకులకు గ్రామ టీడీపీ అధ్యక్షుడు పానుగళ్ళ కోటేశ్వరరావు బహుమతులు అందజేశారు. యువకులు సాంప్రదాయ ఉత్సవాలలో తమ ప్రతిభను చూపిస్తే సమాజంలో మంచి పేరు గౌరవం వస్తుందని, పిల్లలు మత్తు పదార్థాల జోలికి వెళ్ళకుండా చదువుల్లో రాణించి, తల్లిదండ్రులకు సంతోష పెడుతూ మంచి పౌరులుగా ఎదగాలని పానుగళ్ల ఉద్బోధించారు.


భవ్యశ్రీ పూజితకు చెక్కు ఇస్తున్న మంత్రి సారథి

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చాట్రాయి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడుకు చెందిన మిద్దె చంద్రశేఖర్ కుమార్తె భవ్యశ్రీ పూజితకు రూ 3.31 లక్షలు, కంభంపాటి సత్తిబాబు భార్య విజయలక్ష్మికి రూ. 5 లక్షలు మొత్తం రూ 8.31 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం మునునూరులో మంత్రి అందజేశారు.

వ్యవస్థలు నిర్వీర్యం : హరనాథ్

చాట్రాయి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయటం వల్ల ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతున్నదని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ విమర్శించారు. సుప్రీంకోర్టు బిహార్ రాష్ట్రంలో రద్దు చేసిన 65 లక్షల ఓటర్ల జాబితాలను బహిర్గతం చెయ్యాలని, రద్దు చెయ్యటానికి గల కారణాలు తెలియజేయాలని ఆదేశించటం హర్షణీయమన్నారు. ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం పోతున్నదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించటం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతున్నదన్నారు. భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ, మన సార్వభౌమాధికారానికి భంగం కలిగించే ట్రంప్ చర్యలకు అడ్డుకట్ట వేయాలని కేంద్రాన్ని హరనాథ్ డిమాండ్ చేశారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

ముదినేపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని ముదినేపల్లిలో మండల ప్రెస్ క్లబ్ ఆదివారం ఘనంగా నిర్వహించింది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చిలకలపల్లి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యవర్గ సభ్యుడు వి. విజయకుమార్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు గుంటూరు చంద్రశేఖర్, బొర్రా శివరాజ్, ఎస్. సెల్వరాజ్, భుజంగ వెంకట నరసింహారావు, పి. నందీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టుల్లో ఐక్యత ముఖ్యమని వక్తలు పేర్కొన్నారు.


[illegible] పామాయిల్ గెలలు

పామాయిల్ గెలల చోరీ

మునునూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం శివారు పెద్దపాటివారిగూడెంకు చెందిన రైతు వడ్డపట్ల వెంకటేశ్వరరావు తన 3.5 ఎకరాల్లో పామాయిల్ పంట వేసుకుని జీవిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఆగంతుకులు పామాయిల్ గెలలను కట్ చేసి ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా తోటలోకి వచ్చిన పాలేరు కొత్తూరు జీయన్ రైతుకు సమాచారం ఇచ్చాడు. రైతు, అతని కుమారుడు గణేష్ వచ్చే సరికి పామాయిల్ గెలల లోడ్‌తో వారు పరారయ్యారు. గణేష్ వారిని వెంబడించి, బలివే వద్ద ట్రాక్టర్‌ను అడ్డుకోగా, డ్రైవర్‌తోపాటు మరికొంత మంది అతనిపై దాడిచేసి లోడ్‌తో పారిపోయారు. దీనిపై గణేష్ ఆరా తీయగా దెందులూరుకు చెందిన మైనేడు, సతీష్, తులసి, బాలాజీతోపాటు మరో ఐదుగురు చోరీకి పాల్పడినట్లు గుర్తించాడు. వీటి విలువ సుమారు రూ. 1.50 లక్షలు ఉంటుందని బాధిత రైతు మునునూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.